వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

వినాయక్‌నగర్, సెప్టెంబర్19: జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గౌతమ్ గాంబియే(26) ఓ యువతిని ఇష్టపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న సదరు యువతి అతడిని నిరాకరించింది. దీంతో యువకుడు తీవ్ర మనస్తాపం చెంది ఖానాపూర్ గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై ఎంపీ ఆరిఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో ..

నిజామాబాద్ నగర శివారులోని రామ్ నగర్‌లో నివాసం ఉండే ప్రభుగౌడ్(51) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామ్ నగర్ శివారులోని చెరువులో ప్రభుగౌడ్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.దీంతో వారు చెరువులో నుంచి మృతదేహాన్ని బయటికి తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆరిఫ్ తెలిపారు.

పోచారం గ్రామంలో..

ఎడపల్లి, సెప్టెంబర్ 19: ఆర్థిక ఇబ్బందుల కారణంగా మండలంలోని పోచారం గ్రామంలో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. పోచారం గ్రామానికి చెందిన ఒద్దెటి పూజిత(33) భర్త గతంలో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. కుటుంబ పోషణ భారమై తనకున్న ఒక్క కుమారుడిని తన అక్క ఎడిగ గిరిమవ్వ వద్ద ఉంచి చదివిస్తోంది. జీవితంపై విరక్తి చెంది బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి అక్క గిరిమవ్వ వర్ని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసును వర్ని, ఎడపల్లి పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

కాలువలో పడి ఒకరి మృతి

కోటగిరి, సెప్టెంబర్ 19: బాన్సువాడకు చెందిన సాయిరాం(40) కోటగిరి ఎత్తొండకు వెళ్లే మార్గంలో ఉన్న నీటి కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎత్తొండకు చెందిన విజయకు పాత బాన్సువాడకు చెందిన సాయిరాంతో వివాహమైంది. కొంత కాలంగా ఇంట్లో తరుచూ గొడవలు జరుగుతుండడంతో విజయ తల్లిగారింటికి వచ్చి ఎత్తొండలో ఉంటుంది. ఈ నెల 18న సాయిరాం ఎత్తొండకు వస్తున్నట్లు ఫోన్ ద్వారా చెప్పి రాలేదు. గురువారం ఉదయం కోటగిరి సమీపంలోని నీటి కాలువలో సాయిరాం మృతదేహం బయటపడింది. కోటగిరి నుంచి ఎత్తొండకు వచ్చేటప్పుడు మద్యం మత్తులో కాలువలో పడి ఊపిరాడక మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ ..

పొతంగల్, సెప్టెంబర్ 19: మండల కేంద్రంలోని చెరువులో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. మండల కేంద్రానికి చెందిన గుండ్ల సాయవ్వ(43)గా పోలీసులు గుర్తించారు. సాయవ్వ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నదని రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి రాలేదు. గురువారం చెరువులో ఆమె మృతదేహం లభ్యం కావడంతో ప్రమాదవ శాత్తు కాలుజారిపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలి

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

వ్యవసాయాధికారులకు కలెక్టర్, ఎమ్మెల్యే దిశానిర్దేశం

ఖిలీల్‌వాడి, సెప్టెంబర్ 19 : మరో నెల రోజుల్లోపు పంట దిగుబడులు చేతికందనున్న తరుణంలో చీడపీడల బెడదతో రైతులు నష్టపోకుండా సస్యరక్షణ చర్యలపై వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలతో వాతావరణ పరిస్థితుల్లో చోటు చేసుకున్న మార్పుల కారణంగా పంటలకు దోమపోటు, ఆకుముడత వంటి తెగుళ్లు, చీడపీడలు సోకే ప్రమాదం ఉంది. వాటి నివారణ కోసం ముందస్తు చర్యలు చేపట్టేందుకు సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సమావేశానికి హాజరైన రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఆయా పంటలకు చీడపీడలు సోకే ప్రమాదం ఉండడంతో వాటి బారి నుంచి పంట దిగుబడిని కాపాడుకునేందుకు పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రానున్న మూడు రోజుల్లోభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేయడంతో పంటలకు నష్టం వాటిల్లకుండా చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడారు. జిల్లాలో ఈసారి వానకాలంలో 4.29 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారని, ఇందులో 85 శాతానికి పైగా సన్నరకం ధాన్యం సాగు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, శాస్త్రవేత్తలు డాక్టర్ బాలాజీ నాయక్, రాజ్‌కుమార్, దివ్య, ఏడీఏ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక లోపాలు ఉన్న ఈవీఎంలు బెంగళూరుకు తరలింపు

ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 19. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్ లో సాంకేతిక లోపాలు తలెత్తిన ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ గురువారం బెంగళూరుకు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో 78 బ్యాలెట్ యూనిట్లు, రెండు కంట్రోల్ యూనిట్లను తరలించారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

కోవాబ్రెడ్ తిని పలువురికి విరేచనాలు

శాంపిళ్లు సేకరించిన ఆహార భద్రతా సిబ్బంది

కోవాబ్రెడ్ శాంపిళ్లను సేకరిస్తున్న ఆహార భద్రతా కార్యాలయ సిబ్బంది

ఖిలీల్‌వాడి, సెప్టెంబర్ 19: జిల్లాలో కల్తీ ఆహార విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన ఆహార భద్రతా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు నాసిరకం, కల్తీ పదార్థాలను కొనుగోలు చేసి రోగాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. తాజాగా జిల్లా కేంద్రంలో కోవాబ్రెడ్ తిని పలువురికి విరేచనాలు అయ్యాయి. దీంతో మున్సిపల్ అధికారులు ఆహార భద్రత అధికారికి సమాచారం అందించగా.. బ్రెడ్‌కోవా శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. కర్నూల్‌కు చెందిన కొందరు బ్రెడ్‌కోవా అంటూ పదిరూపాయలకు విక్రయిస్తున్నారు.అయితే అది కోవా కాదని, చాకీ, రవ్వ, డాల్డా తదితర పదార్థాలతో తయారుచేస్తున్నట్లు తెలిసింది. వీటిని తిన్న కొంతమంది విరేచనాలు చేసుకోవడంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు జిల్లా ఆహార భద్రతా కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఇక్కడ ఆహార భద్రతా అధికారి లేడని, ఇన్‌చార్జి అధికారి హైదరాబాద్‌లో ఉన్నాడని జోనల్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారని కార్యాలయ సిబ్బంది చెప్పడం గమనార్హం. బ్రెడ్‌కోవా శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు వారు తెలిపారు.

నిజామాబాద్ హోంగార్డ్స్ ఏసీపీ బదిలీ

వినాయక్‌నగర్,సెప్టెంబర్ 19: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఏసీపీ అరుణ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను సైబరాబాద్ కార్ ఏసీపీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

పౌష్టికాహారంపై అవగాహన

భీమ్‌గల్, సెప్టెంబర్ 19: పట్టణంలో ప్రాజెక్టు స్థాయిలో గురువారం పోషణమాసంలో భాగంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీడబ్ల్యూవో రసూల్‌బీ హాజరై పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పోషకాలుండే వంటలను తల్లులు ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం తయారు చేయగా వారికి బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, అజయ్‌పవార్, మెడికల్ ఆఫీసర్ స్వామి సులోచన, జిల్లా మెడికల్ ట్రైనర్ స్వర్ణలత, సీడీపీవో జ్ఞానేశ్వర్, ఏసీడీపీవో రాంబాబు, జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఇసుక క్వారీ ఏర్పాటు కోసం స్థల పరిశీలన

సుంకిని, కారేగాం మంజీరా నదిలో ఇసుకను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

పొతంగల్, సెప్టెంబర్19: ప్రభుత్వ ఇసుక క్వారీ ఏర్పాటు కోసం మండలంలోని సుంకిని, కారేగాం మంజీరా నదిని సంబంధిత శాఖ జిల్లా అధికారులు గురువారం పరిశీలించారు. పొతంగల్‌తో పాటు బోధన్ మండలంలోని సిద్ధాపూర్, సాలురా మండలంలోని మందర్నలో మంజీరా నదిని ఆయా మండలాల రెవెన్యూ అధికారులతో జిల్లా అదికారుల బృందం పరిశీలించింది. బృందంలో ఏడీ విజయ్‌కుమార్‌రాథోడ్, టెక్నికల్ అసిస్టెంట్ నగేశ్, టీఎస్ ఎండీఎస్ శివతేజ్ తదితరులు ఉన్నారు.

యువకుడిపై కత్తితోదాడి

వినాయక్‌నగర్,సెప్టెంబర్ 19: ఓ యువకుడిపై కత్తితో దాడిచేసిన ఘటన జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. సంజీవయ్య కాలనీకి చెందిన అజయ్ అనే యువకుడు వినాయక నిమజ్జనం నుంచి తిరిగివస్తుండగా స్థానిక యువకులు అటకాయించి అనవసరంగా చేయి చేసుకున్నారు. దీనిని గమనించిన అజయ్ సోదరుడు అర్వింద్ ఎందుకు కొట్టారంటూ వారిని నిలదీశాడు. దీంతో మద్యం మత్తులో ఉన్నవారిలో నుంచి ఓ యువకుడు అర్వింద్‌పై కత్తితో దాడిచేశాడు. గాయపడిన అతడిని వెంటనే దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుటిలెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2-3మూడేండ్లలో మరో 3-4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య



టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు

తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంక్‌రప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంక్‌రప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కన్సల్టెంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'

-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- **కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్**
- **దసరా తర్వాత కోర్సులు ప్రారంభం**

స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, వర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచనప్రాయంగా వెల్లడించింది. తొలి ఏడాది 2వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, బోర్డు కో చైర్మన్ శ్రీని రాజు, సభ్యులు దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్పెయిన్ రాయబారి జువాన్ ఆంటోనియో మార్చ్ పుజోల్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై సీఎంను అభినందించారు. స్పెయిన్‌ను సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు.

భారత్‌పై ఫెడ్ ప్రభావమెంత!

అర శాతం వడ్డీరేట్ల కోతపై భిన్నాభిప్రాయాలు

ముంబై, సెప్టెంబర్ 19: వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల మీద ఆ ప్రభావం ఎంతన్నదానిపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దేశీయ ఎక్స్‌పర్ట్స్ పెట్టుబడులు పెరుగుతాయంటుంటే.. మరికొందరు ఈక్విటీలపై రాబడులు తగ్గుతాయని, బంగారం ధరలు పెరుగవచ్చని అభిప్రాయపడుతున్నారు. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ.. బెంచ్‌మార్క్ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 4.75-5 శాతంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. మునుపు ఇది 5.25-5.50 శాతంగా ఉండేది. గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించేందుకు వరుసగా 14 నెలలపాటు 20 ఏండ్ల గరిష్ఠ స్థాయిలోనే కీలక వడ్డీరేటును అగ్రరాజ్య సెంట్రల్ బ్యాంక్ ఉంచింది. 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ఊహించిందే. బంగారం ధరల్లో పెరుగుదలకు, ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులపై లాభాల తరుగుదలకు ఈ నిర్ణయం దారితీయవచ్చు' అని పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు సం